



సదరం క్యాంపులో కలెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో జరుగుతున్న సదరం క్యాంపును కలెక్టర్ ఒ.ఆనంద్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రిజిస్ట్రేషన్ జరుగుతున్న విధానాన్ని పరిశీలిం చారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారందరికి అదేరోజు పరీక్షలు పూర్తి చేసి పంపించాలన్నారు. క్యాంపుకు వచ్చేవారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా నీరు ,ఆహారం తదితర వసతులు కల్పించాలన్నారు. దివ్యాంగులకు ఐడి కార్డులు ఇచ్చే ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఆసుపత్రి ఇంచార్జి సూపర్డెంట్ డా.నరేంద్ర, డా. మస్తాన్ భాషా, డా.గంగాధర్ తదితరులు క్యాంపు నిర్వహిస్తున్న తీరును వివరించారు.


సదరం క్యాంపులో కలెక్టర్

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

రైతు సంఘం జిల్లా కమిటీ

ప్రజాశక్తి-నెల్లూరు

కొనుగోలు కేంద్రాలలో పంటను నష్టానికి అమ్ముకుంటూ దగాపడుతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. గురువారం రైతు జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు పులి గంగ్ల శ్రీరాములు మాట్లాడుతూ రైతు తాను పండించిన ధాన్యం ట్రాక్టర్లలో తీసుకెళ్లి అమ్ముకొనే వాతావరణం ఏర్పాటు చేయడంలో ప్రభుత్వ విఫలమైందన్నారు రైతు పండించిన ధాన్యానికి క్వింటల్ కు 2800 నుండి 3000 ఖర్చు అవుతుంటే కేంద్రం క్వింటల్ కు కనీస మద్దతు ధర 2320 గా (పుట్టి రూ. 19720) ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ధర లో తక్కువ.. తూకం లో మోసానికి రైతు బలి అవుతున్నారన్నారు. తేమ శాతం ఒకటి 17 శాతం వున్నా కొనుగోలు కేంద్రంలో తిప్పుకోకుండా కొంటారనే నమ్మకం రైతులకు



లేకపోవడం, ధాన్యం కేంద్రాలకు తీసుకెళ్లేందుకు బస్తాలు, కూలీలు, ధాన్యం రవాణా చేసేందుకు ట్రాన్స్‌పోర్టు సౌకర్యం సకాలంలో లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. జిల్లాలో సుమారు 15 లక్షలు పట్లు పండుతుంటే రాష్ట్ర ప్రభుత్వం, 5 లక్షలు మెట్రిక్ టన్నులు మాత్రమే కొంటామని ప్రకటనచేసి ప్రతి గింజ కొంటాం అని అందరు ప్రకటలు చేయడం రైతులను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. కొనుగోలు కేంద్రం సిబ్బంది మిల్లర్లు దళారులు కొంత మంది అధికారులు ఏకమై రైతులను దగా చేసి తక్కువరేటు ఎక్కువ తూకాన్నిపెట్టి బద్దం చేశారన్నారు. విధి లేని పరిస్థితుల్లో రైతులు ధాన్యం అమ్ముకుం టున్నారన్నారు. ఈ నేపథ్యంలో రైతుల బాధలను తెలుసుకునేందుకు జిల్లా వ్యాప్తంగా రైతు సంఘం త్వరలో పర్యటిస్తుందని, ఈ పర్యటనను జిల్లా రైతాంగం జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.వెంగయ్య, జిల్లా ఉపాధ్యక్షులు చంద్ర రాజగోపాల్, లక్కు ప్రసాద్, జిల్లా సహాయకార్యదర్శులు గండవరపు శ్రీనివాసులు, పూడిపర్తి జనార్ధన్, పలువురు జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పారిశ్రామికాభివృద్ధికి కృషి : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు జాప్యం లేకుండా అనుమతులు మంజూరు చేసి జిల్లా పారిశ్రామిక పురోభివృద్ధికి ఇతోధికంగా తోడ్పడాలని జిల్లా కలెక్టర్ ఒ. ఆనంద్ సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఎస్ ఆర్ శంకరన్ హాల్లో జిల్లా పరిశ్రమలు ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తుల పురోగతి, పిఎంఈజిపి రుణాల మంజూరు, క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ మొదలైన అంశాలను జిల్లా పరిశ్రమలశాఖ జిఎం మారుతీ ప్రసాద్ వివరించారు.కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటవుతున్న పరిశ్రమలకు సంబంధించి అన్ని అనుమతులను ఆయా శాఖల అధికారులు సత్వరమే మంజూరు చేయాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్దిష్ట గడువు కంటే ముందుగా అనుమతులు ఇవ్వాలన్నారు. పరిశ్రమల


మాట్లాడుతున్న కలెక్టర్ ఓ ఆనంద్

ఏర్పాటుకు భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించిన పెండింగ్ లో ఉన్న మ్యుటేషన్స్ ను వెంటనే పూర్తి చేయవలసిందిగా కందుకూరు సబ్ కలెక్టర్, ఆత్మకూరు ఆర్డీవో లను ఆదేశించారు. అవసరమైన సందర్భాల్లో రెవిన్యూ, ఇరిగేషన్, పంచాయితీ శాఖలు ఉమ్మడి తనిఖీలు చేపట్టాలన్నారు. జిల్లా లోని ఇండస్ట్రియల్ పార్కుల్లో వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రింటింగ్ క్లస్టర్ ఏర్పాటుకు సంబంధించి ఇదివరకే ఆమంచర్ల వద్ద కేటాయించిన భూమికి బదులు కేకే గుంట, అనంతవరం వద్ద ఏపిఐఐసి ఆధ్వర్యంలో వున్న భూమిని పరిశీలించి కేటాయించాలని ఏపిఐఐసి అధికారులకు సూచించారు. చిన్న, మధ్యతరగతి పరిశ్రమలను ప్రోత్సహించేందుకు పిఎంఈజిపి రుణాలు వివిధ మంజూరు చేయాలని సూచించారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు జాప్యం లేకుండా అనుమతులను మంజూరు చేయాలని వివిధ శాఖల అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, ఏపిఐఐసి జడ్ఎం శివకుమార్, డ్వామా పిడి గంగా భవాని, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, ఎల్డీఎం శ్రీకాంత్ ప్రదీప్, ఇరిగేషన్ ఎస్ఈ దేశ్‌నాయక్, డిటిసి చందర్, కమిటీ సభ్యులు ఎపికె రెడ్డి, ఒమ్మిన సతీష్, శ్రీనివాసులు, భక్తవత్సలం, వెంకటేష్ , ప్రింటింగ్ క్లస్టర్ నిర్వాహకులు మల్లికార్జున్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వేలం కేంద్రంలో పరిశీలన

ప్రజాశక్తి-కందుకూరు : పొగాకు బోర్డు తేలిక నెలల ప్రాంతీయ అధికారి ఎమ్. లక్ష్మణరావు కందుకూరు ఒకటో పొగాకు వేలం కేంద్రాన్ని గురువారం సందర్శించి వేలం ప్రక్రియని పరిశీలించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ రైతులు అమ్మకాలు ప్రారంభ దశలో ఉన్నందున వేలం లో అమ్ముడుపోయే గ్రేడ్‌లను వేలానికి తీసుకొని రావాలని సూచించారు. ఎవరు కూడా లో గ్రేడ్‌లు కానీ, హీట్, సాఫ్ట్ డ్యామేజ్ ఉన్న బేల్ లు తీసుకొని రావిద్దన్నారు. గ్రేడ్‌ల వారీగా మార్కెట్ ఉన్నందున గ్రేడ్‌లు సరిగా చేసుకుని గ్రేడ్ ల వారీగా బేళ్ళు తీసుకొని రావాలని సూచించారు. వ్యాపారవేత్తలతో మాట్లాడుతూ వ్యాపారస్తులు క్రమ శిక్షణతో కొనుగోలు జరిపించి మంచి గిట్టుబాటు ధర రైతులకి కల్పించేలాగా చూడాలని సూచించారు. తదనంతరం సిబ్బందితో సమావేశమయ్యి వేలం ప్రక్రియ సజావుగా సాగడానికి తగు సూచనలు చేశారు. వేలం నిర్వాహణదికారి ఎమ్ కిరణ్ ఉన్నారు.



ఇంటి పన్నుపై వడ్డీని మాఫీ చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - నెల్లూరు

సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఇంటి పన్నుల కుళాయి పన్నులను బలవంతంగా వసూలు చేసే పద్ధతిని మానుకోవాలన, ఇంటి పన్నుపై వడ్డీని మాఫీ చేయాలని , మంచినీటి కుళాయిల ద్వారా తాగేందుకుసురక్షితమైన మంచినీటిని ఉచితంగా అందించాలని డిమాండ్ చేస్తూ సచివాలయం ఎదుట నిరసన, ధర్నా చేపట్టారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా స్థానిక 54వ డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ కాలనీ మూడు జెండాల సెంటర్ నుంచి స్థానిక సచివాలయం వరకు స్థానిక ప్రజలతో ర్యాలీ చేసి అనంతరం సచివాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అడ్మిన్ సెక్రటరీకి వినతి పత్రం అందజేశారు. సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నగర కార్యదర్శి వర్గ సభ్యులు జి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇంటి పన్నులు,కుళాయి పన్నులు బలవంతంగా వసూలు చేయడం సరికాదన్నారు. పన్నులు చెల్లించకపోతే కుళాయి కనెక్షను,కరెంటు కట్ చేస్తామని పేద ప్రజలని భయభ్రాంతులకు గురిచేస్తూ బలవంతంగా పనులు వసూలు చేస్తున్నారని, ఈ రకమైన చర్యలను నగరపాలక సంస్థ అధికారులు ఆపాలని కోరారు. భగత్ సింగ్ కాలనీలో ఇంటి యజమాని పేరు లేకుండా డోర్ నెంబర్ తో ఇంటి పన్నులు విధిస్తున్నారని డోర్ నెంబర్ తో ఎలా ఇంటి పన్ను విధిస్తారని అధికారులను సిపిఎం పార్టీ నాయకులు ప్రశ్నించారు. వెంటనే ఇంటి యజమాని పేరుతో ఇంటి పన్ను నోటీసులు ఇవ్వాలని అధికారులను కోరారు. ఇంటి పన్నులు,కుళాయి పన్నులు చెల్లించడానికి ప్రజలకు వాయిదాల పద్ధతిలో చెల్లించడానికి ప్రజలకు అవకాశం కల్పించాలని అదేవిధంగా వడ్డీ మాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేదంటే 25న కార్పొరేషన్ ఆఫీస్ వద్ద మహాధర్నా చేపడతామన్నారు.జనార్ధన్‌రెడ్డి కాలనీ, శాఖ కార్యదర్శి ఎస్‌కె జాఫర్,నగర కార్యదర్శి వర్గ సభ్యులు పి సూర్యనారాయణ నగర కమిటీ సభ్యులు బిపి నరసింహ, మూలం ప్రసాద్,కత్తి పద్మ,కె చంగయ్య, పి వేణు,శాఖ కార్యదర్శులు గడ్డం శ్రీనివాసులు రెడ్డి, గోతం మురళి, బాబు, సాయి,శ్రీనివాసులు రెడ్డి బయన్న ఉన్నారు.



ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్లు

ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 24,289 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జాయింట్ కలెక్టర్ కొల్లాబతుల కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం 3582 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు జేసి చెప్పారు. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ 24 గంటల నుంచి 48 గంటల్లోగా రైతుల ఖాతాలకు డబ్బులు జమ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇప్పటివరకు 52.10 కోట్ల రూపాయలు రైతులకు చెల్లించినట్లు జేసి తెలిపారు. రైతులందరూ కూడా దళారుల మాటలు విని తక్కువ ధరకు అమ్ముకోవద్దని సూచించారు.

ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘన : ఎస్ఎఫ్ఐ


ప్రజాశక్తి-నెల్లూరు :జిల్లాలోని అనేక ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు ఒంటిపూట బడులు నిర్వహిస్తు న్నాయని, ఇది ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించే పరిస్థితి అని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ అధ్యక్షులు వెన్ను.నరేంద్ర ఒక ప్రకటన ఆక్షేపించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. డిఇఒ స్పందించి నిబంధనలు అమలయ్యేవిధంగా చర్యలు తీసుకోకపోతే ఎస్ఎఫ్ఐ, జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోలన చేస్తామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు ఇవే..

ప్రజాశక్తి-కందుకూరు :మండలంలోని ఓగూరు సబ్ స్టేషన్ నుంచి వెళ్లే 11 కెవి గనిగుంట ఫీడర్‌లో లైనుకు తగిలే చెట్ల కొమ్మలను తొలగించేందుకు శుక్రవారం ఉదయం 08-30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఈ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు అసిస్టెంట్ ఇంజనీర్ టివి నరసిహం తెలిపారు.ఈ ఫీడర్ పరిధిలో ఉన్నటువంటి గనిగుంట, దీవివారి పాలెం గ్రామ ప్రజలు విద్యుత్ శాఖ వారికి సహకరించాలని అయన కోరారు.


ప్రభుత్వమే ఫిషింగ్ హార్బర్లు నడపాలి : తూమాటి

ప్రజాశక్తి-కందుకూరు : రాష్ట్రంలోని ఫిషింగ్ హార్బర్లను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పకుండా ప్రభుత్వమే నిర్వహించాలని ఎంఎల్‌సి తూమాటి మాధవరావు కోరారు. గురువారం శాసనమండలిలో తూమాటి మాధవరావు మాట్లాడారు. 1000 కిలోమీటర్ల పోడవున ఉన్న సముద్ర తీరంలో గతంలో ఉన్న మూడు ఫిషింగ్ హార్బర్ తో పాటు మరో 6 ఫిషింగ్ హార్బర్లను గత ప్రభుత్వం 3500 కోట్ల రూపాయలతో అభివద్ధి చేయడం ప్రారంభించిందని చెప్పారు. ఈ 9ఫిషింగ్ హార్బర్లు పనులు పూర్తయి ఉపయోగం లోకి వస్తే అనేక మెకనైజడు బోట్లు నిలుపుకోవడానికి అవకాశం వస్తుందని చెప్పారు. దీని ద్వారా లక్షల టన్నుల మత్స్య సంపదను ఎగుమతి చేసే అవకాశాలు ఉంటాయన్నారు. ఫలితంగా జిడిపి పెరుగుతుందని చెప్పారు. మత్స్యకారులకు ఎంతో ఉపయోగ కలుగుతుందని తూమాటి మాధవరావు సమావేశంలో తెలిపారు. ప్రభుత్వమే నిర్వహిస్తుందని మంత్రి చెప్పినందుకు తూమాటి ధన్యవాదాలు తెలిపారు.


మండలిలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి 'తూమాటి'

'టిఆర్‌ఆర్'లో పిచ్చుకల దినోత్సవం

ప్రజాశక్తి-కందుకూరు :కందుకూరు టిఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ప్రపంచ పక్షుల దినోత్సవం కళాశాల జంతు శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం రవికుమార్ మాట్లాడుతూ పిచ్చుకలు మానవుల స్నేహితులన్నారు. పర్యావరణ సమతుల్యతకు పిచ్చుకలు ఎంతో దోహద పడతాయన్నారు.పెరుగుతున్న వాతావరణ కాలుష్యం వల్ల పిచ్చుకలు అంతరించిపోయే ప్రమాదం ఉందన్నారు.వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిదన్నారు. కళాశాలలో పిచ్చుకల పరిరక్షణకు గుళ్ళు ఏర్పాటు చేసి, గింజలు, నీళ్ల ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడతామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. జంతు శాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ ఐ అనూష మాట్లాడుతూ పిచ్చుకలను కాపాడు కోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. పిచ్చుకల దినోత్సవం ఏ సందర్భంగా ప్రారంభించారో ఆ స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు నరేంద్ర, అధ్యాపకులు డాక్టర్ ఎన్వి శ్రీహరి,డాక్టర్ కే సుజాత, డాక్టర్ పి రాజగోపాల్, డాక్టర్ ఎన్ తిరుపతి స్వామి, జే జ్యోతి, జి బ్రహ్మయ్య ఉన్నారు.



రామాయపట్నం పోర్టు భూ సేకరణ పరిధిలో

దళిత కాలనీ, హైస్కూల్‌ను మినహాయించాలి

సబ్ కలెక్టర్‌కు చేవూరు గ్రామస్తులు వినతి

ప్రజాశక్తి -గుడ్లూరు

రామయపట్నం పోర్టుకు అనుబంధంగా పరిశ్రమల కోసం ఫిబ్రవరి 25వ తేదీన దళిత కాలనీని, సాయి హై స్కూల్‌ను భూసేకరణ చేస్తామని ఇచ్చిన నోటిఫికేషన్ రద్దు చేయాలని కోరుతూ చేవూరు ప్రజలు సిపిఎం ఆధ్వర్యంలో, గురువారం కందుకూరులో సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజశేఖర్ కు వినతి పత్రం అందజేశారు. గురువారం సబ్ కలెక్టర్ మండలంలోని చేవూరు సచివాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ప్రజలు వినతిపత్రం అందజేశారు. అనంతరం సిపిఎం గుడ్లూరు ఏరియా కార్యదర్శి జీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సాయి పబ్లిక్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో , 300 మందివిద్యార్థులు, చదువుకుంటున్నారని, ఆ స్కూల్‌ను భూ సేకరణలో పెట్టినందువల్ల వారంతా నష్టపోతారన్నారు. దళిత కాలనీని మొత్తం భూ సేకరణ భూసేకరణ పరిధిలోకి తేవడం వల్ల వందలాది మంది నిరుపేదలు, నిరాశ్రయులు అవుతారన్నారు. ఈ నేపథ్యంలో 848, 849, 583,586 తదితర సర్వే నెంబర్లను భూ సేకరించి మినహాయించి, వెంటనే రీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. లేదంటే దీనిపై 24వ తేదీన పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని తెలిపారు. ప్రస్తుతం నిర్వాసితులకు ఎకరాకు 23 లక్షలు చెల్లిస్తున్నారని, ఇది సరిపోదని, సరిపోదని, గోరుచుట్టుపై రోకటిపోటు లాగా, అసైన్మెంట్ భూములకు, 21. 80 లక్షలు ఇవ్వడం సరికాదన్నారు. పట్టా భూములతో సమానంగా అసైన్మెంట్ భూములకు కూడా నష్టపరహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు, ఇరువురి బ్రహ్మయ్య, వెంకటేశ్వర్లు , గ్రామ సర్పంచ్ శెట్టిపల్లి వెంకటేశ్వర్లు .సాయి స్కూల్ అధినేత, బాసం వెంకటేశ్వర్లు, చేవూరు యువకులు, అక్కిలగుంట దానియేలు, చేవూరి కరుణాకర్, మధు, చెవూరు బ్రహ్మయ్య, కొండయ్య ఉన్నారు.


సబ్ కలెక్టర్ శ్రీ పూజకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


కాలనీల్లో పర్యటిస్తున్న కమిషనర్

డివిజన్లలో కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి-నెల్లూరు

నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా కమిషనర్ సూర్య తేజ గురువారం వివిధ డివిజన్లో పర్యటించి స్థానిక పార్కులలో మౌలిక వసతులు సౌకర్యాలను పరిశీలించారు. పర్యటనలో భాగంగా 40 వ డివిజన్ మూలపేట వాటర్ ట్యాంక్ పార్క్, 42 వ డివిజన్, ఏఆర్బి ఫంక్షన్ హాల్ బ్యాక్ ఖుద్దూస్ నగర్ పార్క్, అమీన్ నగర్ పార్క్, 44 వ డివిజన్ మహబూబ్ ఖాన్ పార్క్ నియర్ కలెక్టరేట్, 48 ఏపీజే అబ్దుల్ కలాం పార్క్, 47 గుప్తా పార్క్ లను సందర్శించారు.ఆయన వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసులు, హార్టికల్చర్ ఏ.డీ ప్రదీప్ కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రఘురాం, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, వెటర్నరీ డాక్టర్ మదన్ మోహన్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ ప్రకాష్, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

'వేములపాటి'జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-నెల్లూరు

జనసేన జిల్లా ఇన్‌ఛార్జి, టిడ్కో చైర్మన్ వేములపాటి అజయకుమార్ జన్మదిన వేడుకలను జిల్లా జనసేన నేతలు ఘనంగా నిర్వహించారు. జనసేన రూరల్ సమన్వయ కర్త, జిల్లా కోర్ కమిటీ సభ్యులు కాకు మురళి రెడ్డి ఆధ్వర్యంలో జనసేన నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారునెల్లూరు మద్రాస్ బస్టాండ్ సెంటర్ వద్ద గల వినాయక స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించి, 101 టెంకాయలు కొట్టి స్వామి వారికి హారతి సమర్పిం చారు. జనసేన నాయకులు, పావుజెన్ని చంద్ర శేఖర్ రెడ్డి, నూనె మల్లిఖార్జున యాదవ్, గునుకుల కిషోర్ కష్ణా రెడ్డి, రవి, హరి రెడ్డి,కరీం,సుధా మాధవ్,గద్రం కిషోర్, మహేష్ శర్మ,మస్తాన్, మనోజ్,జమీర్, సురేష్ సుల్తాన్ భాషా,శ్రీకాంత్,అలేఖ్, సూర్య ఉన్నారు.



ఉద్యోగోన్నతి పొందినా.. ఎక్కడివారు అక్కడే..!

ఎఎన్ఎంలకు ఆరోగ్య శాఖ షాక్

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

సచివాలయ కార్యదర్శులకు ఆరోగ్య శాఖలో సహాయకులుగా ప్రభుత్వం పదోన్నతులు కల్పించిన విషయం తెలిసిందే. పదోన్నతులు పొందిన ఎఎన్ఎంలకు ఆరోగ్య శాఖ షాక్ ఇచ్చింది. డిప్యూటేషన్ విధానాన్ని కాస్త పక్కన పక్కన పెడితే ఉద్యోగోన్నతి పొందిన ప్రభుత్వ ఉద్యోగు లు ఇతర ప్రాంతాలకు బదిలీ కావడం అనేది అనాదిగా అన్ని ప్రభుత్వ శాఖల్లో కొనసాగుతోంది. అయితే ఈ సంస్కృతికి జిల్లా ఆరోగ్య శాఖ తిలోదకాలిచ్చింది. ఉద్యోగోన్నతి పొందినా ఇప్పటి వరకు ఎక్కడ పని చేశారో ఆ కేంద్రాల్లోనే విధులు కొనసాగించాలని ఎఎన్ఎంలకు ఆరోగ్య శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఆరో గ్య శాఖ అధికారులు జారీ చేసిన ఆదేశాలతో ఉద్యోగోన్నతి పొందిన ఏఎన్ఎంలకు దిక్కుతోచని పరిస్థితి ఎ దురైంది.. ఇప్పటి వర కు సచి వాలయాలలో గ్రేడ్ 3 కేటగిరి కింద ఉన్న వారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో గ్రేడ్ 2 కేటగిరి కిందకు వచ్చారు. ఉద్యోగోన్నతులు పొందిన అనంతరం సచివా లయాల ఏఎ న్ఎంలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఏ ఎన్ఎంలుగా (ఎంపిహెచ్ఎ (ఎఫ్)లుగా కొనసాగుతారు. ప్రస్తుతం ఆరోగ్య శాఖ తీసుకొన్న ఈ నిర్ణయం ఉద్యోగోన్నతి పొందిన ఎఎన్ఎంల గుండెల్లో గుబు లుపుట్టిస్తోంది. కారణంగా ఉద్యోగోన్నతి పొందిన వా రంతా తిరిగి గతంలో చేసిన ప్రాంతాల్లోనే పనిచేయాల్సి రావడం. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు సచివాల యాల ఎన్ఎంలు గా చేసిన సర్వేలతో పాటు ప్రాథమి క ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు ఇచ్చే సర్వేలు కూడా చేయాల్సి వస్తుందేమోనని ఆందోళన చెందుతున్నారు. ఇలా ఆ ఎఎన్ఎంల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.



'అపోలో'లో ఆధునిక చికిత్సలు

ప్రజాశక్తి-నెల్లూరు

కారణాలు ఏవైనా తలకు బలమైన గాయం తగిలిన వ్యక్తి ప్రాణాలను కాపాడటంలో మొదటి గంట ఎంతో కీలకమని, ఆ గంటలోపు చికిత్స అందకపోతే ప్రతీ సెకనుకు లక్షలాదిగా మెదడు కణాలు చనిపోతూ ఉంటాయని అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ అన్నారు. అపోలో హాస్పిటల్ లో తలకు బలమైన గాయాలు తగిలిన వారికి సత్వరం చికిత్స అందించేందుకు అవసరమైన ఎమర్జెన్సీ క్రిటికల్ కేర్ విభాగాలు 24 గంటలూ అందుబాటులో ఉంటాయని పేర్కొ న్నారు. ప్రపంచ తల గాయాల అవగాహన దినోత్సవం సందర్భంగా గురువారం అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ లో మీడియా సమావేశం జరిగింది. హాస్పిటల్ డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, న్యూరో సర్జరీ విభాగ అధిపతి డాక్టర్ ఏ.వి. రమణమూర్తి, ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ వెంకట్, హాస్పిటల్ ఎమర్జెన్సీ అండ్ క్రిటికల్ కేర్ విభాగ కన్సల్టెంట్ డాక్టర్ ఎం. శ్రీనివాస్, న్యూరో సర్జన్ డాక్టర్ ఉబేద్ పాల్గొన్నారుడాక్టర్ శ్రీరామ్ సతీష్, డాక్టర్ ఏ.వి. రమణమూర్తి, డాక్టర్ వెంకట్ మీడియాతో మాట్లాడారు. ప్రతి ఏడాది మార్చి 20న జరుపుకునే ప్రపంచ తల గాయాల అవగాహన దినోత్సవంలో తలకు బలమైన గాయాలు తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మన్నారు. నెల్లూరు అపోలో హాస్పిటల్ లో సిస్టెర్నోస్టమీ అనే కొత్త అధునాతన మెదడు శస్త్ర చికిత్సను ప్రారంభించామని, తలకు బలమైన గాయం తగిలి మెదడు దెబ్బతిన్న వారికి ఈ శస్త్ర చికిత్స చేస్తే రోగులు త్వరగా కోలుకుంటారని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న అపోలో వైద్యులు


'ఆడుదాం.. ఆంధ్ర'లో నిధులు స్వాహా..

వెలుగులోకి వచ్చిన అక్రమాలు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :మండలం కోడూరులోని డాక్టర్ బిఆ ర్ అంబేద్కర్ బాలికల గురుకులంలో పలు అవినీతి అ క్రమాలు వెలుగులోకి వచ్చాయి. గత వైసిపి ప్రభుత్వ పాలనలో విద్యార్థులకు ఆడుదాం.. ఆంధ్రా పోటీలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ మేరకు కోడూరు బాలికల గురుకులం నుంచి క్రీడాకారులు ఆడుదాం ఆంధ్ర పోటీలలో పాల్గొన్నారు. ఈ క్రీడల్లో విజేతలకు వైసిపి ప్రభుత్వం ప్రోత్సాహం కింద సుమారు లక్ష రూపాయలు మంజూరు చేయడం జరి గింది. ఈ మేరకు క్రీడల్లో గెలుపొందిన వారి బ్యాంక్ ఖా తాల్లో జమ కావాల్సిన నిధులు ప్రిన్సిపాల్ ఎస్తేరమ్మ త న వ్యక్తిగత ఖాతాలో జమ చేసుకొన్నట్లు అప్పట్లో ఆరో పణలు వచ్చాయి. అయితే అవి ఆరోపణలు కాదని ని ఖార్సయిన నిజాలేనని గురుకులం వ్యాయామ ఉపా ధ్యాయురాలు పి. హేమలత గురువారం కుండబద్దలు కొట్టింది. ప్రభుత్వం నుంచి గురుకు లం కు వచ్చే నిత్యావసర వస్తువులను సైతం సిబ్బంది బయ ట అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిసింది. గురుకులంలో జరుగు తున్న అవినీతి అక్రమాలు వెలు గు చూడడంతో ఔరా అంటూ మండల ప్రజలు ముక్కు న వేలేసుకొంటున్నారు. అవినీతి అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేసి పేద విద్యార్థుల నోళ్లలో మట్టి కొట్టిన దోషులను కఠినంగా శిక్షిం చాలని విద్యార్థుల తల్లిదండ్రులు, మండలవాసులు కలెక్టర్ కు విజ్ఞప్తి చేస్తున్నారు.

సుగర్ ఫ్యాక్టరీ కార్మికులను ఆదుకోండి

ప్రజాశక్తి-కోవూరు:కోవూరులో 124 ఎకరాల్లో ఉన్న సుగర్ ఫ్యాక్టరీలో పనిచేసిన కార్మికులను ఆదుకోవాల్సిన అవసరం ఉందని కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. గురువారం అసెంబ్లీలో ఆమె కోవూరు సుగర్ ఫ్యాక్టరీ అంశంపై మాట్లాడారు. సుగర్ ఫ్యాక్టరీ కార్మికులను ఆదుకొని, వారికి రావాల్సిన బకాయిలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కోవూరు సుగర్ ఫ్యాక్టరీలో గతంలో మూడు వేల మంది కార్మికులు పనిచేసేవారన్నారు. వారిలో చాలామంది ఇప్పటికే మరణించారని చెప్పారు. పనిచేసిన కార్మికుల జీతాల బకాయిలు రూ.20 కోట్ల వరకు ఉన్నాయన్నారు. ఆరు సార్లు ఎమ్మెల్యే అని చెప్పుకొని తిరిగే మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి కమీషన్ల కోసం కార్మికుల బకాయిలు చెల్లించకుండా నిలిపివేశారని ధ్వజమెత్తారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో కార్మికుల బకాయిలు చెల్లించి వారిని ఆదుకోవాలన్నారు. అదేవిధంగా 124 ఎకరాల సుగర్ ఫ్యాక్టరీ భూములను సద్వినియోగం చేసుకుని ఆదాయం పెంచుకునే వీలుందన్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తెచ్చామన్నారు.కోవూరు నియోజకవర్గంలోని ఇఫ్కో కిసాన్ సెజ్‌లో వేలాది ఎకరాల భూమి అందుబాటులో ఉందని, ఇందులో సరైన మౌలిక సదుపాయాలు లేక కంపెనీలు సరిగా రావడం లేదన్నారు. సెజ్‌లో సదుపాయాలు కల్పిస్తే పరిశ్రమలు తరలొచ్చి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు అందుతాయని, ప్రభుత్వం ఈ అంశాలపై దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ ప్రశాంతిరెడ్డి


మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీహరిరెడ్డి

గృహ నిర్మాణాలు మరింత వేగవంతం

ప్రజాశక్తి-కోవూరు:మండలంలోని కాలనీలో ప్రస్తుతం గృహ నిర్మాణాలు మరింత వేగవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపీడీఓ శ్రీహరి రెడ్డి అన్నారు కోవూరులోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం గృహ నిర్మాణ శాఖకు సంబంధించి ఏఈలు, వర్క్ ఇన్స్పెక్టర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం. గృహ నిర్మాణాలు చేపడుతున్న ఎస్‌సి, బిసి, లబ్ధిదారులకు రూ.50 వేలను అదనంగా మంజూరు చేసిందన్నారు. అదేవిధంగా ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేలు అదనంగా చేసిందని, దీనిని దృష్టిలో పెట్టుకుని ఆయా లబ్ధిదారుల్లో ప్రత్యేకంగా అవగాహన కల్పించి నిర్మాణాలు వేగవంతం అయ్యేలా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ అసిస్టెంట్ల వారీగా పనితీరుపై సమీక్షించారు. ఈ సమీక్షలో గృహ నిర్మాణ శాఖ ఏఈ మాధవయ్య, తదితరులున్నారు.

సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-కోవూరు :కోవూరులోని శ్రీ చైతన్య ఆంగ్ల మాధ్యమ పాఠశాలయాజమాన్యం పాఠశాల భవనానికి సంబంధించి యాజమానులకు గత రెండు సంవత్స రాలుగా అద్దె చెల్లించకుండా ఇబ్బందులు పెడుతున్న నేపథ్యంలో బుధవారం భవన యజమాని వినీత్‌రెడ్డి పాఠశాలకు తాళాలు వేశారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. ఇప్పటికే తాము వేలాది రూపాయలు చెల్లించి తమ బిడ్డలను పాఠశాలలో చేర్పించామని, ఈ నేపథ్యంలో హఠాత్తుగా పాఠశాలకు తాళాలు వేయడంతో తమ బిడ్డల పరిస్థితి ఏమిటని వారు ఆందోళన చెందారు. ఈ మేరకు శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యం భవన యాజమానులతో మాట్లాడి సమస్యను సానుకూలంగా చేయ డంతో ఎట్టకేలకు గురువారం పాఠశాలకు తలుపులు తెరుచుకున్నాయి. దీంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకుని తమ బిడ్డలను పాఠశాలకు పంపారు.

మెగా ఉచిత దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కోవూరు :మండలంలోని గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. సందీప్‌కుమార్ మాట్లాడుతూ తమ కళాశాల కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఇటువంటి సదస్సులను తరచుగా నిర్వ హిస్తున్నామన్నారు. ఇప్పటికే తమ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలను, వైద్య శిబిరాలను రక్తదాన శిబిరాలను గ్రామస్తులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ఈ శిబిరంలో డాక్టర్ మహ్మద్ అనీఫ్, ఆర్థో డెంటిస్ట్ డాక్టర్ రావీణా ఆధ్వర్యంలో 200 మంది విద్యార్థులకు, 150 మంది అధ్యాపకులకు, బోధనేతర సిబ్బందికి దంత పరీక్షలు నిర్వహించి దంతాల ఆరోగ్యం పట్ల పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వై. మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆదరణ కేంద్రంలో జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-బిట్రగుంట: నెల్లూరు పార్లమెంట్ కమిటీ అధ్యక్షులు క్రమశిక్షణ కమిటీ చైర్మన్ ఆంధ్రప్రదేశ్ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ 68వ పుట్టినరోజును ఆదరణ కేంద్రంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి, కావలి అసెంబ్లీ సమన్వయ కమిటీ సభ్యులు సమ్మును వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆదరణ కేంద్రంలోని వృద్ధులకు సుమారు 50 మందికి చికెన్ బిర్యానీ భోజన సదుపాయాలను తోట రాజేష్ ఏర్పాటు చేశారు. ఫ్రూట్స్ తదితర వస్తువులను ఎనిమిదో వార్డు జనసేన పార్టీ సాబిర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ అజయ్ రాకముందు నెల్లూరు జిల్లా జనసేన పార్టీ ఎవరికి వారే యమునా తీరే అనే సందంగా ఉండేదని, ఆయన వచ్చిన తర్వాత జనసేన పార్టీని నెల్లూరు జిల్లాలో ఉన్నటువంటి 10 నియోజకవర్గాలను ఒక తాటిపైకి తీసుకొచ్చి జనసేన పార్టీని బలోపేతం చేస్తున్నారని చెప్పారు. జనసేన పార్టీ క్రియాశీలక సభ్యులు కూడా ఆయన వచ్చిన తర్వాత సంఖ్య గణనీయంగా పెంచారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు తోకల వెంకటేశ్వర్లు, పట్టణ ప్రధాన కార్యదర్శి తోట చరణ్, సీనియర్ నాయకులు పాలడుగు వెంకటేశ్వర్లు, జాని, షేక్ షమి, షేక్ జిలాని, జిల్లెల కొండయ్య, పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పంపిణీ చేయాలని వినతి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు పురపాలక పరిధిలో 16,17 వార్డుల పరిధిలో రెండు నెలలుగా రేషన్ బియ్యం సక్రమంగా అందించడం లేదని సరఫరా చేసే వాహనదారుడిని అడిగితే ఈనెల ఇచ్చే బైం అయిపోయిందని చెప్పడంతో తమ బియ్యం ఇప్పించాలని పలువురు మహిళలు ఆత్మకూరు తహశీల్దార్ కార్యాలయం చేరుకొని తహశీల్దార్‌కు మొరపెట్టుకున్నారు. తమ ప్రాంతానికి బియ్యం సరఫరా చేసే డీలర్ ను అడిగితే వాహనదారుడిపై చెపుతుందని అతనిని అడిగితే యాప్ మూసివేయించిందని చెప్పున్నారని వారు తహశీల్దార్ సుధీర్ కు ఫిర్యాదు చేశారు. 7వ తేదీ నాటికే యాప్ ఓపెన్ కాలేదని ఎండియు ఆపరేటర్లు ఆయన దృష్టికి తెచ్చారు. ఏదేమైనా పేదల బియ్యం ఇవ్వకపోవడం సరికాదని, ఇలాంటి పరిస్థితులు మరోసారి పునరావృతం కాకుండా చూడాలన్నారు. వచ్చే నెలలో పూర్తిస్థాయిలో బియ్యం లబ్ధిదారులకు అందజేసేలా వారికి జీతాలు చెల్లిస్తామని కఠినంగా చెప్పారు. ఆ వార్డుకు చెందిన మహిళలు సైరాబీ, బీబీజాన్, షైలమ్మ, నూర్జహాన్, బండారు జయమ్మ, మహబూ న్నిసా, తదితరులు పాల్గొన్నారు.



దోమల నివారణకు నిధుల కొరత

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం:బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీలో నిధులు కొరత వెంటాడుతుంది కనీసం పారిశుద్ధ కార్మికులకు కూడా జీతాలు ఇచ్చే పరిస్థితులు నగర పంచాయతీ పాలకవర్గం లేకపోవడం దారుణమైన విషయం. మొత్తం నెలలు గడుస్తున్న ఇంతవరకు పారిశుధ్య కార్మికులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితులు బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ కొట్టుమిట్టాడుతుంది. ప్రస్తుతం బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీలోని 20 వార్డుల్లో ప్రజలు దోమల బెడదతో కంటిమీద కునుకు లేకుండా తీవ్ర అవస్థలు పడుతున్నారు. రాత్రి ఆరు గంటల నుంచి దోమల బెడద ఎక్కువ కావడంతో నగర పంచాయతీ ప్రజలు జాగారం చేస్తున్నారు. వీటిని నివారించే విషయంలో నగర పంచాయతీ సిబ్బంది పాలకవర్గం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. కనీసం దోమల నివారణకు చేయాల్సిన బ్లీచింగ్ చల్లడం, బాట్స్ వేయడం సాగించేటువంటి పనులు కూడా చేయకపోవడంపై పాలకవర్గంపై ప్రజలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

పలుచోట్ల అధ్వానంగా పారిశుధ్యం


ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం
మండలంలోని జొన్నవాడ గ్రామంలో ప్రజా చైతన్య యాత్ర నాల్గవ రోజు వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తంబి రమణయ్య ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పలు సమస్యలపై ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పవిత్ర పుణ్యక్షేత్రాలలో ఒకటైన జొన్నవాడ గ్రామంలో పినాకిని నది తీరాన కొలువుదీరిన శ్రీ మల్లికార్జున స్వామి సమేత కామాక్షి తాయి అమ్మవారి ఆలయం నిత్యం భక్తులతో రద్దీగా ఉంటుందన్నారు. పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉండడంతో భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులను మరికొందరిని నియమించి మరుగుదొడ్లు, ఆలయానికి చుట్టుపక్కల శానిటేషన్ పనులను మెరుగుపరచాలని సిపిఎం తరపున ఆలయ అధికారులను ఆయన కోరారు. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి చొరవ తీసుకొని జొన్నవాడ గ్రామంలో డ్రెయినేజీ కాలువ పనులు, సిమెంట్ రోడ్లు, పేదలకు పక్కా గృహాలు మంజూరు చేయాలని సిపిఎం తరపున ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి ఎం సురేష్, సిపిఎం నాయకులు టి రమణయ్య, కె.వెంకట రమణయ్య, మహిళా సంఘం నాయకురాలు కందికట్టు జయమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాటారు శీనయ్య, పలువురు సిపిఎం నాయకులు పాల్గొన్నారు.


కదలిన మురుగు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట
స్థానిక పోలీస్ స్టేషన్‌కు దగ్గరలో మురుగు నీరు చేరి ఉందని పట్టించుకునే నాధుడే లేదని స్థానికులు గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మండల హెడ్ క్వార్టర్‌లోని పోలీస్ స్టేషన్‌కు సచివాలయానికి మోడల్ స్కూలు, కస్తూరిబా గాంధీ, అన్ని ప్రదేశాలకు వెళ్లే దారి మార్గంలో మురుగు మీరు చేరి దుర్వాసన వెదజల్లుతుంది. అందరూ చూస్తూ వెళుతున్నారే కానీ గతంలో గ్రామ సభలో సైతం నాయకులు, ఎస్ఐ ఎన్నోసార్లు ఆ మురుగును క్లీన్ చేయమని చెప్పినను, పంచాయతీ సిబ్బంది పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నాన్నారు.ఇకనైనా సంబంధిత అధికారులు పారిశుధ్య మెరుగునకు కృషిచేయాలని ఆయా ప్రాంతవాసులు కోరుతున్నారు.

మా మధ్య విభేదాల్లేవ్

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం
కోవూరు నియోజకవర్గ టిడిపి నాయకులు మధ్య ఎలాంటి విభేదాలు లేవని పార్టీ సీనియర్ నాయకులు పెన్నా డెల్టా కమిటీ మాజీ చైర్మన్ యర్రం రెడ్డి గోవర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని రేబాల గ్రామంలో ఆయన నివాసంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల తనకు నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్‌కు మధ్య చిన్నపాటి మనస్పర్థలు వచ్చాయని వాటిని వెంటనే పరిష్కరించు కున్నామని తెలిపారు. ఈ విభేదాలు టీ కప్పులో తుపాను లాంటివన్నారు. తమ శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తనను పార్టీ నుంచి దూరంగా పెట్టినట్లు ఇతర మండల నాయకులకు పెత్తనం ఇస్తున్నారని వచ్చే ఆరోపణలు నిజం కాదన్నారు. రాజకీయాలకు కొత్తైన తమ శాసన సభ్యురాలు పార్టీలో సమన్వయం కోసమే ఇతర మండల నాయకులను నియమించినట్లు తెలిపారు. త్వరలోనే శాసనసభ్యురాలు ఆధ్వర్యంలో మండల స్థాయిలో కమిటీని ఏర్పరుస్తున్నట్లు అన్నారు. నియోజకవర్గంలో అవినీతి జరుగుతున్నట్లు ఇతర పార్టీ నాయకులు చేస్తున్న ఆరోపణలు ఆయన కొట్టి పారేశారు. స్థానిక మండలంలో తన తరువాత వవ్వేరు కో-ఆపరేటివ్ బ్యాంక్ మాజీ చైర్మన్ సూరా శ్రీనివాసులు రెడ్డిని బలమైన నాయకులుగా ఆయన అభివర్ణించారు. కార్యక్రమంలో రేబాల గ్రామ సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఎంపీపీ మన్నేపల్లి శ్రీనివాసులు, మస్తానయ్య, రియాజ్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టిడిపి నాయకులు

జెడ్‌పి చైర్మన్‌ను కలిసిన వైసిపి

ప్రజాశక్తి-బిట్రగుంట: బోగోలు మండలం వైసిపి కన్వీనర్ మద్ది బోయిన వీర రఘు ఆధ్వర్యంలో జెడ్‌పిటిసి సభ్యురాలు మద్దిబోయిన కీర్తన, విశ్వనాథరావుపేట బిట్ 2 ,ఎం,పి,టీ,సీ సభ్యులు ఏ,కే సుందర్ రాజ్, మండలం సీనియర్ నాయకులు గురువారం జిల్లా పరిషత్ చైర్మన్ అరుణమ్మను వైసిపి నెల్లూరు రూరల్ ఇన్‌ఛార్జ్ ఆనం విజయ కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా వారి నివాసానికి వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా బోగోలు మండల కన్వీనర్ మద్దిబోయిన వీర రఘు మాట్లాడుతూ బోగోలు మండలంలోని పలు సమస్యలపై జిల్లా పరిషత్ చైర్మన్ అరుణమ్మను కలిశామని తెలిపారు. కార్యక్రమంలో బోగోలు మండల వైసిపి సీనియర్ నాయకులు కిరణ్ కుమార్, నాయకులు తదితరులున్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ

ప్రజాశక్తి-బిట్రగుంట:అంగన్‌వాడీ దినోత్సవ సందర్భంగా ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ . నెల్లూరు జిల్లా చీఫ్ దాసరి సునీల్ వారి బృందం బోగోలు మండలం, రామస్వామి పాలెం లోని అంగన్‌వాడీ కేంద్రా లను గురువారం తనిఖీ చేశారు. హ్యూమన్ రైట్స్ చీఫ్ దాసరి సునీల్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం ఏవిధంగా ఉంటుంది అని, పిల్లల పట్ల భద్రత విషయాల ఏ విధంగా ఉన్నాయి అని, భోజనం ఏవిధంగా వండుతున్నారని, అక్కడ పిల్లలతోనూ పిల్లల తల్లిదండ్రులతోనూ టీచర్ ఆయమ్మ వాళ్లతో మాట్లాడారు. అంగన్‌వాడీ పాఠశాలలో పిల్లల పట్ల పిల్లలకు పెట్టే భోజనం చుట్టుపక్కల పరిశుభ్రంగా ఉంచమని చెప్పడం జరిగిందని, పిల్లలకు ఈ సందర్భంగా చాక్లెట్లు పంచారు. కార్యక్రమంలో బత్తుల రవిచంద్ర, శివకుమార్, షేక్ నూరుద్దీన్ పాల్గొన్నారు.

ఆర్ఎస్ఆర్‌లో కాలేజీ మ్యాగజైన్ 2కె24 రిలీజ్

ప్రజాశక్తి-బిట్రగుంట:బోగోలు మండలం, కడనూతల గ్రామంలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం సంహిత పేరుతో కాలేజీ మ్యాగజైన్ 2కె24 రిలీజ్ చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి,వి,ఎన్, రెడ్డి తెలిపారు. వారు మాట్లాడుతూ ఈ మ్యాగజైన్‌లో 2024 జనవరి 1 నుంచి 31 డిసెంబర్ 2024 వరకు కళాశాలలో జరిగినటువంటి అన్ని కార్యక్రమాలు ఇందులో పొందుపరిచామన్నారు.ఫ్యాకల్టీ ప్రోత్సాహాలుంటే ఈ సమయంలో ఏయే ఫ్యాకల్టీ ఎస్ పీటీఎల్, ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం, పేపర్ ప్రజెంటేషన్ లలో పార్టిసిపేట్ చేసి ఉత్తమ ప్రతిభ చూపి ప్రశంసా పత్రాలను పొందిన ఫ్యాకల్టీని ఈ మ్యాగజైన్‌లో పబ్లిక్ చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థిని ,విద్యార్థులు వివిధ యూనివర్సిటీలలో, వివిధ కళాశాలలో ప్రశంసా పత్రాలను పొందిన వారిని గుర్తించి వారి వారి ప్రశంసా పత్రాలను ఈ మ్యాగజైన్‌లో పబ్లికేషన్ చేయడం జరుగుతుందని తెలిపారు. కళాశాల మేనేజ్మెంట్ విద్యార్థిని ,విద్యార్థులకు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందికి అందించినటువంటి సౌకర్యాలు, ఇతర వివరాలు కూడా ఇందులో పబ్లికేషన్ చేయడం జరిగిందని తెలిపారు. జాతీయ, రాష్ట్రస్థాయి, యూనివర్సిటీ స్థాయి, జిల్లాస్థాయిలలో కళాశాల తరపున పొందినటువంటి అన్ని వివరాలను ఈ మ్యాగజైన్‌లో పబ్లిక్ చేయడం జరుగుతుందన్నారు. ఈ మ్యాగజైన్ వల్ల విద్యార్థిని, విద్యార్థులలో అధ్యాపకులలో పోటీ తత్వం పెరిగి లేటెస్ట్ సాంకేతిక విద్యలో వచ్చినటువంటి మార్పులను, కొత్తదనాలను బాగా తెలుసుకునుటకు వీలుగా తోడ్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఏ,ఓ, ఆర్‌వి రమణారెడ్డి, మ్యాగజైన్ చీఫ్ ఎడిటర్ డాక్టర్ ఎస్, డి ముజాహిద్దీన్, మ్యాగజైన్ ఇతర కోఆర్డినేటర్స్ తో పాటు అన్ని విభాగాలు అధిపతులు తదితరులు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

కరాటేపై అవగాహన

ప్రజాశక్తి-వరికుంటపాడు:ఏదైనా ఆపదలో ఎటువంటి విపత్కర పరిస్థితులైన ఎదుర్కొని మిమ్ములను మీరే కాపాడుకునే విధంగా సిద్ధంగా ఉండాలని ఎస్ఐ ఎం. రఘునాథ్ తెలిపారు. మండలంలోని తిమ్మారెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు గురువారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు ఎప్పుడైనా ఎక్కడైనా ఆపద సమయంలో ఎవరైనా అడ్డగించినా లేకపోతే ఏదైనా అరాచకం చేసిన అటువంటి సమయంలో మీరే కరాటే వంటివి నేర్చుకొని ఆపద సమయంలో ఎదుర్కొనేందుకు సంసిద్ధులు కావాలన్నారు. అనంతరం కరాటే పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాల కొండయ్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఇఒ షేక్ మస్తాన్‌వలీ

సిఆర్ ఎంటిల సమావేశం

ప్రజాశక్తి-ఉదయగిరి:
సిఆర్ ఎంటిలతో మండల విద్యాశాఖ అధికారి 1 షేక్ మస్తాన్ వలి గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భ ంగా మండల విద్యాశాఖ అధికారి కార్యాల యంలో ఆయన సిఆర్‌ఎంటిలతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ డ్రాప్ ఓట్స్ రీ జాయినింగ్ ప్రాసెస్‌ను తమ పరిధిలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు తెలియజే యాలన్నారు. ఎస్ఏ పి4 పరీక్షలకు సంబం ధించిన మార్కులను త్వరితగతిన ఆన్లైన్ లో నమోదు చేసే విధంగా ప్రధానో పాధ్యాయులకు తెలియజేస్తూ ఉండాలన్నారు. ఆధార్ కార్డులేని విద్యార్థుల సమాచారం అపార్ ఐడి వివరాలు ప్రతి సి ఆర్ ఎం టి వద్ద ఉండాలని, డిప్యూటేషన్ లపై పాఠశాలలకు వెళ్లినప్పుడు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, ఆన్లైన్ యాక్టివిటీస్ ఎప్పటికప్పుడు పూర్తి చేసే విధంగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమాచారం అందిస్తూ ఉండాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్
:మోటర్ బైక్ పై వస్తున్న యువకుడిని ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ సంఘటన ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నెల్లూరు- జాతీయ రహదారిపై ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ జిలానీ సమాచారం మేరకు.. తెల్ల పాడు ముస్తాపురం గ్రామానికి చెందిన తాటిపర్తి ఈశ్వర్ (19) కూలీ పనులు చేస్తూ ఉంటాడు. ఈ క్రమంలో కరటంపాడు వెళ్లి తిరిగి ముస్తాపురం వెళ్లేందుకు వస్తుండగా ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో ఎదురుగా లారీ, బైక్‌ను ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలైన ఈశ్వర్ అక్కడికక్కడే మతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ సంఘటలా స్థలానికి చేరుకున్నాడు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పద్మావతమ్మకు నివాళులు

ప్రజాశక్తి-వరికుంటపాడు
మండల ప్రజా పరిషత్ అధికారి గొట్టిపాటి వేణుగోపా లరావు తల్లి కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. గురువారం నెల్లూరులోని వారి స్వగృహంలో పెద్దకర్మ సందర్భంగా మండల కన్వీనర్ చంద్రా మధుసూదన్ రావు, జెడ్‌పిటిసి రావెళ్ల నాగేంద్ర, తదితరులు పద్మావతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


కాలువను పరిశీలిస్తున్న దృశ్యం

జలాశయం కాలువ పరిశీలన

ప్రజాశక్తి-వరికుంటపాడు: మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో గండిపాలెం పొన్నబోయిన చెంచురామయ్య జలాశయం కాలువ వద్ద ప్రవహిస్తున్న నీటిని గురువారం టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జెడ్‌పి మాజీ చైర్మన్ పొన్నె బోయిన చెంచల బాబు యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెంచురామయ్య జలాశయం రైతులకు ఒక వరమన్నారు. ఈ జలాశయం నీటి ప్రవాహానికి కాలువ మరమ్మతులకు కృషిచేసిన మన శాసనసభ్యులు కాకర్ల సురేష్ కృషి అభినందనీయమని కొనియాడారు. రూ.15 లక్షల నిధులతో కాలువ మరమ్మతులు చేపించి దాదాపు 4 వేల ఎకరాలలో రైతులకు సాగునీరందేలా కాకర్ల సురేష్ కృషి చేశారని తెలియజేశారు. రైతులు నీటిని దుర్వినియోగం చేయకుండా ప్రతి నీటి బొట్టునూ సద్వినియోగం చేసుకోవాలని చివరి ఆయకట్టవరకూ రైతులు పంటలు పండించుకొనుటకు ఎటువంటి ఇబ్బంది లేదన్నారు. ప్రతి రైతుకూ నీటి వసతి కలదని తెలియజేశారు. ఆయన వెంట ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కుమ్మిత రమణారెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు మాజీ మండల ఉపాధ్యక్షులు చల్లకొలుసు రమణయ్య యాదవ్, రైతులు ఉన్నారు.

మెట్ట రైతు బాగు లక్ష్యంగా అసెంబ్లీలో చర్చ

ప్రజాశక్తి-బిట్రగుంట:వ్యవసాయ సాగు పొలాల ఆయకట్టు వాస్తవిక లెక్కల సవరణకోసం, మిగులు సాగునీటిని మెట్ట రైతుకు మళ్లించేందుకోసం గురువారం అసెంబ్లీలో కావలి శాసనసభ్యుడు దగ్గు మాటి కృష్ణారెడ్డి మాట్లాడారు. స్వాతంత్ర్యం తర్వాత, సాగునీటి ప్రాజెక్టులు నిర్మించుకున్నాక వ్యవసాయ భూములను అనేక అభివృద్ధి పనులు, ప్రభుత్వ, ప్రయివేట్ పారిశ్రామిక అవసరాలకు నియోగించిన పరిస్థితి చూస్తున్నామని, కానీ ఎక్కడ కూడా అలాంటి భూములను 2006 ల్యాండ్ కన్వర్షన్ యాక్ట్ కింద వ్యవసాయేతర భూములుగా మార్చిన పరిస్థితి లేదన్నారు. సాగునీటి కేటాయింపులు తగ్గించిన స్థితి లేదు, ఉదాహరణకు రాష్ట్ర రాజధాని ప్రాంగణం, నెల్లూరు జిల్లాకేంద్రంలో వందేకరాల్లో ఉన్న నారాయణ వైద్య శాల ప్రాంగణం కూడా నేటికి వ్యవసాయ భూమి జాబితాలోనే ఉన్నాయి. వాస్తవిక ఆయకట్టు పునర్నిర్వచించని కారణంగా డెల్టాగా చెప్పబడే ప్రాంతాలలో వృథాగా సముద్రం పాలవుతున్న జీవజలం, అదే సమయంలో నీరులేక సాగు చేయలేక చూస్తున్న మెట్ట ప్రాంత రైతాంగం, ఇది రాష్ట్ర వ్యాప్త సమస్య అని మాట్లాడారు. ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టిపెట్టి ,భారీ, మధ్య, చిన్న తరహా సాగునీటి ప్రాజెక్టుల కింద మొత్తంగా ఆయకట్టు పునర్ నిర్వచించి మిగులు జలాలను మెట్ట రైతాంగానికి కేటాయించేలా చూస్తే ఎంతోమంది రైతాంగానికి న్యాయం జరుగుతుంది. దీనిని సత్వరమే చేపట్టాలని సంబంధిత మంత్రివర్యులకు, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఉరేసుకొని వ్యక్తిఆత్మ హత్య

ప్రజాశక్తి-మర్రిపాడు:
ఉరేసుకొని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈసంఘటన మండలం లోని రాజులపాడు అటవీ ప్రాంతంలో గురువారం చోటుచే సుకు ంది. పోలీసుల సమాచారం మేరకు.. రాజులపాడు గ్రామానికి చెందిన నారు బక్కిరెడ్డి (70)చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మ హత్య చేసుకున్నాడు. భార్య అనా రోగ్య కారణాలతో మనస్తాపం చెంది ఆత్మ హత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో ఎస్ఐ శ్రీనివాసరావు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-వరికుంటపాడు
మండల కేంద్రమైన వరికుంటపాడులో అత్యాచార యత్నం కేసులో నిందితుడిని గురువారం అరెస్టు చేసి ఉదయగిరి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ ఎం. రఘునాథ్ తెలిపారు. గత ఆదివారం రాత్రి వృద్ధురాలిపై యువకుడు అత్యాచారయత్నానికి పాల్పడుతుండగా ప్రతిఘటించి కేకలు వేయడంతో పరారైన విషయం విధితమే.

22 నుంచి అడ్మిషన్లకు దరఖాస్తులు

ప్రజాశక్తి-కలిగిరి
:మండలంలోని ఏపీలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో (ఏపీ కె సి డి వి) ప్రవేశాలకు మార్చి 22 నుంచి ఆన్లైన్లో దరఖాస్తులు స్వీకరించనున్నట్టు సమగ్ర శిక్షా ఎస్‌పి బి.శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రంలోని 352 కేజీబీవీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 6, 11 తరగతుల్లో ప్రవేశాల కోసం, 7, 8, 9, 10, 12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం బాలికల నుంచి ఆన్లైన్ దరఖాస్తులు స్వీకరించనున్నట్టు చెప్పారు. ఆన్లైన్ దరఖాస్తులు మార్చి 22 నుంచి ఏప్రిల్ 11 వరకు అందుబాటులో ఉంటాయన్నారు.

"కమిషనర్ వివరణ"

ప్రస్తుతం నగర పంచాయతీ వద్ద కేవలం ఆరు లక్షల రూపాయల నిధులు మాత్రమే ఉన్నట్లు కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. కోటి రూపాయల నిధులు ఉండాల్సిన నగర పంచాయతీలో కేవలం ఆరు లక్షల మాత్రమే ఉన్నాయన్నారు. కోవూరుశాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పలు రకాలుగా సహకరిస్తూ ఇతర నిధులు మంజూరు చేస్తున్నారు. త్వరలోనే దోమల సమస్య పరిష్కారం కోసం ఆమెను సంప్ర దించి దోమల నివారణకు చర్యలు తీసుకుంటా మన్నారు.


పరిశీలిస్తున్న తహశీల్దార్

రీ సర్వేకు సహకరించాలి

ప్రజాశక్తి-కోవూరు
మండలంలోని కోవూరు పంచాయతీ పరిధిలో ప్రస్తుతం జరుగుతోన్న రీ సర్వే కార్యక్రమానికి రైతులు పూర్తిస్థాయిలో సహకరిం చాలని తహశీల్దార్ నిర్మలానంద బాబా తెలిపారు. ఈ మేరకు గురువారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కోవూరు పంచాయతీకి సంబంధించి మొత్తం విస్తీర్ణం 5509 ఎకరాలు కాగా.. అందులో ఇళ్లు 567 ఎకరాల్లో చెరువు 605 ఎకరాలు కాగా.. ఇప్పటికే సర్వే 4407 ఎకరాలు పూర్తయిం దన్నారు.936 ఎకరాలు మాత్రమే సర్వే చేయాల్సి ఉందని, మార్చి నెలాఖరులోగా ఈ సర్వే కార్యక్రమం పూర్తవుతుందన్నారు. సర్వే బృందం కూడా ఏ రోజు ఏ ప్రాంతానికి వెళ్తారో రెండు రోజులు ముందే ఆ ప్రాంత రైతులకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. గురువారం సర్వే కార్యక్రమాన్ని రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ మధుసూదన్‌రావు పరిశీలించి సర్వే బృందానికి పలు సూచనలు చేశారు.